

కమలంలో కొట్లాట..!

◆ పొత్తు పొడవకనే ముఠాల పోరు

◆ హిందూపురం పార్లమెంట్‌కు నేనంటే నేను..



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి, బిజెపికి ఇంకా అధికారిక పొత్తులు కుదరలేదు. ఈ క్రమంలోనే హిందూపురం కమలంలో కొట్లాట మొదలైంది. నేను పోటీ చేస్తానంటే నేను చేస్తానంటూ ముగ్గురు నేతలు పోట్లాడు కుంటున్నారు. ఇటీవల హిందూపురంలో ఇద్దరు నేతలు తాను పోటీ అంటే తాను పోటీ అని ప్రకటనలు చేయడం గమనార్హం. పరిపూర్ణానంద స్వామి వచ్చి తాను పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. అక్కడ మోడీ ఇక్కడ తాను అంటూ ప్రకటన చేశారు. అదే సమయంలో బిజెపి నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి తాను పోటీలో ఉన్నాని ప్రకటించారు. టిక్కెట్టు ఎవరైనా అడగవచ్చు...తాను స్థానికుడిని, మూడు దశాబ్దాలుగా పార్టీలో ఉన్నానని తనకే టిక్కెట్టు కావాలని బాహాటంగానే ప్రకటించారు. ఇదిల ఉండగా సత్యకుమార్ తనకే హిందూపురం టిక్కెట్టు అంటూ చెప్పుకుంటున్నారు. ఇలా ముగ్గురు నేతల మధ్య కమలంలో కుమ్ములాట నడుస్తోంది. వాస్తవానికి హిందూపురం పార్లమెంట్ పరిధిలో బిజెపి అంతటి బలం లేదు. టిడిపి పొత్తులో ఇక్కడ పాగా వేసే ప్రయత్నం చేస్తోంది. ఆ పార్టీకి హిందూపురం పార్లమెంట్ పరిధిలో తగినంత బలం లేదు. ఒక్కసారి కదిరి అసెంబ్లీ నియోజకవర్గంలో పొత్తులో బిజెపి గెలిచింది. ఆ తరువాత నుంచి గెలుపొందిన దాఖలాల్లేవు. గత పార్లమెంటు ఎన్నికల్లో స్వతంత్రంగా బిజెపి పోటీ చేసింది. ఒక్క శాతం ఓట్లకే పరిమితమైంది. 2019 ఎన్నికల్లో 13,21,086 ఓట్లు పోలయితే బిజెపికి వచ్చిన ఓట్లు 13,805 మాత్రమే. ఇప్పుడు టిడిపి పొత్తులో భాగంగా హిందూపురం నుంచి పోటీ చేయాలని చూస్తున్నట్టు సమాచారం. అంతకు మునుపు ఎన్నికల్లోనూ బిజెపికి అంతకు మించి ఓట్లు వచ్చిన దాఖలాల్లేవు. మైనార్టీలు అధికంగానున్న ఈ ప్రాంతంలో వారి నుంచి ఏ రకమైన మద్దతు లభిస్తుందన్నది ప్రశ్నార్థకంగా ఉంది.

వెనుకబడిన ప్రాంతాని బిజెపి ఏమి చేసింది ?

కేంద్రంలోని బిజెపి ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఏమీ చేయలేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికే కేంద్రీయ విశ్వవిద్యాలయంకు నామమాత్రపు నిధులతోనే సరిపెడుతోంది. నాసన్‌ను ఇటీవల ప్రారంభించినా అది మొదటి దశలో మాత్రమే ఉంది.ఇక రైల్వే ప్రాజెక్టుల్లోనూ ఈ ప్రాంతానికి తగినంత ప్రాధాన్యత లేదు. బెల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది. అది ప్రహరీగోడకే పరిమితమైంది. ఇక వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ అదీ లేదు. మొదటి మూడు సంవత్సరాల్లో ఏడాదికి రూ.50 కోట్లు చొప్పున రూ.150 కోట్లు ఇచ్చి చేతులెత్తేసింది. అప్పటి నుంచి ఒక్క రూపాయి నిధులివ్వలేదు. ఈ రకంగా వెనుకబడిన ప్రాంతానికి నిధులు కేటాయించని బిజెపి వచ్చే ఎన్నికల్లో ఏ రకంగా ప్రజల ముందుకెళుతుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

జలిలం చేసిన వారికి అందలం..!



అనంత నగరానికి తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల బాధ్యతారాహిత్యం.. కాసుల కక్కుర్తి కారణంగా ఈ సమస్య జలిలంగా మారినట్లు తెలుస్తోంది. నీటి సరఫరాకు సంబంధించి గత మూడు నెలలుగా సమస్య ఉన్నా దాని నిర్వహణపై సంబంధిత అధికారులు దృష్టి సారించలేదు. దీంతో అప్పట్లో ఆ అధికారులను ఆ బాధ్యతల నుంచి తప్పించి ఇతరులకు అప్పగించారు. ఇప్పుడు మళ్లీ పాత అధికారులకే ఆ బాధ్యతలు ఇస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. సమస్యను పట్టించుకోకుండా జలిలం చేసిన అధికారులకు మళ్లీ ఆ బాధ్యతలు ఇవ్వడం వెనుక ఎవరి సొంత ప్రయోజనాలు దాగి ఉన్నాయన్న సందేహాలు కార్పొరేషన్‌లో వ్యక్తం అవుతున్నాయి.

◆ మోటార్ల మరమ్మతులు పట్టించుకోని అధికారులకు మళ్లీ బాధ్యతలు

◆ కార్పొరేషన్ నీటిసరఫరా విభాగం ప్రక్షాళనపై విమర్శలు

◆ అనంత నగర ప్రజలకు తప్పని తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరానికి నీటి సరఫరా చేసే పిఎబిఆర్ డ్యాంలో మోటార్లు గతేడాది నవంబర్‌లో కాలిపోయాయి. సకాలంలో వాటిని మరమ్మతులు చేయించకుండా అధికార యంత్రాంగం, పాలకవర్గం నిర్లక్ష్యం చేసింది. దీంతో అనంతపురం నగర ప్రజలకు తాగునీటి కష్టాలు తీవ్రం అయ్యాయి. గతంలో మండువేసవిలో సైతం పూర్తి స్థాయిలో తాగునీటి సరఫరా జరిగిన అనంతపురం నగరంలో తొలిసారిగా ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కోవాల్సిని పరిస్థితులు దాపురించాయి. నగరంలోని పాతఊరు, శారదానగర్, నవోదయ కాలనీ, బుడ్డప్పనగర్, తదితర ప్రాంతాల ప్రజలు తాగునీటి కష్టాలను ఏకరువు పెడుతూ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ ఆందోళనకు ఏకంగా అధికార పార్టీ కౌన్సిలర్లే నాయకత్వం వహించడం సమస్య తీవ్రతకు అద్దంపడుతోంది. నీటి సరఫరాకు సంబంధించి గతేడాది నవంబర్‌లో 500 హెచ్‌పి మోటార్ కాలిపోయింది. డిసెంబర్ నెలలో 750 హెచ్‌పి మోటార్ కాలిపోయింది. ఒకదాని తరువాత ఒకటి కాలిపోయినా దాని మరమ్మతు గురించి అధికారులు పట్టించుకోలేదు. అప్పటి డ్యామ్ ఇన్‌ఛార్జి, డిఇ చంద్రశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్ సుబ్బరామయ్యలు మరమ్మతు చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితిని గుర్తించిన అప్పటి కమిషనర్ భాగ్యలక్ష్మి డ్యాంలో ప్రధాన నీటి సరఫరా విభాగం బాధ్యతలను పూర్తిగా చంద్రశేఖర్‌కు, నగరంలో నీటి సరఫరా పర్యవేక్షణను డిఇ సుభాష్, అసిస్టెంట్ ఇంజినీర్ విజయరాజులకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే డ్యాంలో మోటార్లు మూడు నెలల క్రితమే మరమ్మతుకు గురైనా దాని గురించి ఎలాంటి సమాచారం ఇవ్వని డ్యాం ఇన్‌ఛార్జిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మోటార్లు కాలిపోయిన విషయం అప్పటి కమిషనర్ భాగ్యలక్ష్మికి, పాలకవర్గం నేతకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరించారు. నీటి సరఫరాకు సంబంధించి బాధ్యత చూస్తున్న అధికారులు సమస్య పరిష్కారంపై పూర్తి స్థాయి చొరవ చూపనట్లు తెలుస్తోంది. నగరానికి నీటిని సరఫరా చేసే అత్యంత ప్రజా ఉపయోగకరమైన సమస్యపై నిర్లక్ష్య ధోరణి అవలంభించిన అధికారులపై చర్యలు చేపట్టకుండా ఉపేక్షించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

సమస్యను పట్టించుకోని వారికే మళ్లీ బాధ్యతలు..!

గతంలో మోటార్ల నిర్వహణ గాలికి వదిలేసి సమస్యకు కారణమైన అధికారికి ఇప్పుడు మళ్లీ నీటి సరఫరా బాధ్యతలు అప్పగించేలా ముఖ్యనేతలు చక్రం తిప్పారు. ఆ అధికారిని నియమిస్తూ జారీ చేసిన ఉత్తర్వులపై కమిషనర్ మేఘ స్వరూప్ సోమవారం సాయంత్రం సంతకాలు చేశారు. గతంలో సమస్యను పట్టించుకోని అధికారికే మళ్లీ బాధ్యతలు ఇవ్వడం వెనుక అంతర్యం ఏమిటన్న దానిపై కార్పొరేషన్ అధికారుల్లో పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. మోటార్లు కాలిపోయిన వెంటనే వాటి మరమ్మతులపై దృష్టి సారించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదని ఆ శాఖలోని కొందరు అధికారులు చెబుతున్నారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించి నీటి సమస్యకు కారణమైన వారిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టకపోగా, వారిని మళ్లీ అందలం ఎక్కించడం చూస్తుంటే కొందరు కలిసికట్టుగా కాసుల వ్యాపారం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇక కార్పొరేషన్ ఇంజినీరింగ్ వర్కర్లతో ఘర్షణ వైఖరి అవలంభించే ఒక ఉద్యోగికి పాలకవర్గం అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయనపై విమర్శలు ఉన్నా కలుపుకుని వెళ్లాలని సాక్షాత్తు ఉన్నతాధికారి ఒకరు ఉద్యోగులకు పదేపదే చెబుతుండడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో కమిషనర్ జారీ చేసిన ఇంజినీరింగ్ అధికారుల బాధ్యతల మార్పు ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందా..? తాగునీటి సమస్య పరిష్కారం లభిస్తుందా..? లేక మరింత తాగునీటి సమస్యను ఉత్పన్నం చేస్తుందా..? అన్న ప్రశ్నలు కార్పొరేషన్ అధికార వర్గాల్లో మెదులుతున్నాయి. కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులను చూస్తే అసమర్థతను అందలమెక్కించి, సమర్థవంగా పని చేసే సిబ్బంది నోరు నొక్కేసినట్లుగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా నగరంలో నీటి సమస్యకు కారణమైన అధికారులకే మళ్లీ ఆ బాధ్యతలను ఇవ్వడం వెనుక ఏదో మతలబు దాగి ఉందన్న భావన కార్పొరేషన్‌లో విన్పిస్తోంది.

తాగునీటి పరిస్థితిపై ఉన్నతాధికారుల ఆరా

పరిశీలించిన కర్నూలు కమిషనర్

నగరపాలక సంస్థ నీటి సరఫరా సమస్యపై మున్సిపల్ చీఫ్ సెక్రటరీ, పట్టణాభివద్ధి ఆదేశాలపై కర్నూల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్ తేజ్ పరిశీలించారు. బుధవారం ఆయన పీఏబీఆర్ డ్యాంలోని పంప్ హౌస్‌ను పరిశీలించారు. డ్యాంలో మోటార్ల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని నెలల క్రితం మోటార్లు పాడైపోయాయని ఆరా తీశారు. రెండు నెలలు కావస్తుందని వివరించారు. ప్రస్తుతం రెండు 500 హెచ్‌పి మోటర్లు 20 గంటలు పనిచేస్తున్నందున నగరంలోని చివరి ప్రాంతాలైన ఫెర్రర్ కాలనీ, శారద నగర్, ఎస్‌బిఐ కాలనీ, శ్రీనగర్ కాలనీ, మంగళవారి కాలనీ ప్రాంతాలకు నీటి సమస్య ఉత్పన్నమవుతోందని తెలిపారు. అనంతరం నీటి సమస్య ఉన్న బుడ్డప్పనగర్, ఫెర్రర్ కాలనీల్లో జాయింట్ కలెక్టర్ కేతన్, కమిషనర్ మేఘస్వరూప్ నగరపాలకు సంస్థ అధికారులతో కలిసి మాట్లాడారు. మూడు నెలలుగా సమస్య తీవ్రంగా ఉందని కాలనీవాసులు తెలియజేశారు. నగరపాలక సంస్థలో నీటి సమస్యపై కంట్రోల్ రూమును ఏర్పాటు చేయాలని కర్నూలు కమిషనర్ అధికారులను ఆదేశించారు. స్టాండ్ బై 3వ మోటార్‌ను మార్చి 10వ తేదీ లోపు మరమ్మతు చేయించి తాగునీటి పరిస్థితిని మెరుగుపరచాలని ఆదేశించారు.



తాగునీటి సమస్యపై నగరంలో పర్యటించి ప్రజలతో మాట్లాడుతున్న కర్నూలు కమిషనర్ భార్గవ్ తేజ్

జెఎన్‌టియులో సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నాడు సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. బేసిక్ సైన్సస్, హ్యూమానిటీస్ విభాగం అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫిసర్ ఆర్.రామకృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇండిజినెస్ టెక్నాలజీస్‌పై మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి సర్ సివి.రామన్ గొప్పతనాన్ని పాట రూపంలో ఆలపించారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా ఆర్.పద్మ సువర్ణ వ్యవరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు భువన విజయ, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణ కాంతి, ఇ.కేశవ రెడ్డి, జివి.సుబ్బా రెడ్డి, విబి.చిత్ర, డాక్టర్ దిలీప్, డాక్టర్ శంకర శేఖర రాజు, డాక్టర్ శైలా కుమారి, డాక్టర్ ఎఎఫ్.భారతి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ◆ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసి గృహాలు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ అనంతపురం నగర సిపిఎం న్యూ కమిటీలి ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ అనంతపురం నగరం, రూరల్ మండలాల్లో అనేకమంది పేదలు సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో నివాసాలు ఉన్నారన్నారు. అద్దెలు చెల్లించలేక వీరంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లాలో కరువు నేపథ్యంగా గ్రామాల నుంచి చాలా మంది పేదలు, కూలీలు ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చారన్నారు. వీరందరికీ సొంతిళ్లు లేవన్నారు. ప్రభుత్వం ఇప్పటికే లక్షల ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చామని చెప్పుతున్నప్పటికీ పేదలు, దళితులు, మైనారిటీలలో చాలా మందికి సొంత ఇళ్లు లేని పరిస్థితి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో దాదాపు 800 మంది పేదలు అనంతపురం నగరం సమీపంలోని టీవీ టవర్ వెనుక భాగంలో ఉన్న ఉప్పరపల్లి గ్రామ పొలం 194/8 సర్వే నెంబర్‌లోని 12 ఎకరాల ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్నారని తెలిపారు. దీనిపై ఆర్డీవో, రెవెన్యూ అధికారులు విచారించి అక్కడున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచి, గృహాలు నిర్మించి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర న్యూ టౌన్ కార్యదర్శి ఆర్‌వి.నాయుడు, ఒకటవ కార్యదర్శి రామిరెడ్డి, కార్యవర్గ సభ్యులు ముత్తుజ, ఏటీఎం నాగరాజు, ఇర్ఫాన్, గోపాల్, వలీ, ప్రకాష్, లక్ష్మీనారాయణ, మున్సిపల్ యూనియన్ నాయకులు తిరుమలేశు, రాఘవ, ఆటో యూనియన్ అధ్యక్షులు ఆజంబాషా, గఫూర్, సిఐటియు నాయకులు గుర్రాజు, కెవిపిఎస్ నాయకులు అక్కులప్ప, పేదలు పాల్గొన్నారు.




వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

2,94,353 మందికి రైతుభరోసా సాయం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైఎస్సార్ రైతు భరోసా- పిఎం కిసాన్ మూడవ విడత, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు రాయితీ పంపిణీ జిల్లా స్థాయి కార్యక్రమాన్ని బుధవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఇందుకు సంబంధించిన నిధులను ముఖ్యమంత్రి బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి వేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎం.గౌతమి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ మీసాల రంగన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఉమాదేవి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుభరోసాకు సంబంధించి జిల్లాలో ఈ ఏడాది మూడవ విడతగా రూ.2 వేల చొప్పున జిల్లాలో 2,94,353 మంది రైతులకు రూ.59.01 కోట్లను వారి ఖాతాల్లోకి వేశామన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు కింద రబీ 2021-22, ఖరీఫ్ 2022కి సంబంధించి రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన 83,534 మంది రైతులకు రూ.17.25 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్ రెడ్డి రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నారన్నారు. వరుసగా ఐదవ ఏడాది వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్ పథకం అమలు చేస్తూ రైతులకు సాయం అందించారన్నారు. అనంతరం రైతులకు వైఎస్సార్ రైతు భరోసా- పీఎం కిసాన్, సున్నా వడ్డీ మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు వన్నూరమ్మ, ఎడిసిసి బ్యాంకు మాజీ ఛైర్‌పర్సన్ పామిడి వీరాంజనేయులు, హార్టికల్చర్ డిడి రఘునాథ రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.



రైతు భరోసా, సున్నా వడ్డీ మెగా చెక్కును అందిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్, కలెక్టర్ తదితరులు

శ్రీకృష్ణదేవరాయ కళాశాలకు ఐసిఎఆర్ గుర్తింపు

ప్రజాశక్తి -అనంతపురం

శ్రీకష్ణదేవరాయ కళాశాలకు భారత పరిశోధన వ్యవసాయమండలి (ఐసిఎఆర్)గుర్తింపు నిచ్చింది. అయిదేళ్ల వరకు అక్రెడిటేషన్ ఉంటుందని బాలాజీ విద్యా సంస్థల ఛైర్మన్ పల్లె కిశోర్, సెక్రటరీ, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బోధన, బోధనేతర సిబ్బందిని అభినంధించారు. ఈ కార్యక్రమంలో పల్లె సింధూర, అసోసియేట్ డీన్ రవీంద్రనాథ్‌రెడ్డి, యజమాన్య ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు .

ప్రాణాలను నిలిపే రక్తదానం

అనంతపురం : ప్రమాదంలో గాయపడిన వారికి రక్తదానం చేస్తే వారి ప్రాణాలను కాపాడొచ్చని అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం నాడు కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, యూనిట్-2 డాక్టర్ కె.అరుణ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణక్రాంతి పాల్గొన్నారు. డాక్టర్ నీరజ, డా॥టి.నారాయణలు రక్తదానం, బ్లడ్ గ్రూపుల ప్రాధాన్యతను వివరించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు.

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా బుధవారం నాడు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. సిఐలు, ఎస్ఐల ఆధ్వర్యంలో పోలీసులు పాత నేరస్తులు, రౌడీషీటర్లు, కర్నాటక మద్యం, నాటుసారా, గుట్కా నియంత్రణ కోసం అనుమానితులు, పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల వివరాలను లోతుగా పరిశీలించారు. ఆయా గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. గ్రామసభలు నిర్వహించి ప్రశాంతంగా జీవించాలని గ్రామస్తులకు సూచనలు చేశారు. సమస్యలు సష్టించినా, ఇందుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

భవన నిర్మాణ కార్మికులపై నిర్లక్ష్యం



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను అన్ని విధాలా నిర్లక్ష్యం చేస్తోందని ఆ సంఘం నాయకులు విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ అర్బన్ తహశీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం నాడు ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. గతంలో కార్మికులకు అమలు అవుతున్న సంక్షేమ పథకాలను సైతం ఆపేసిందన్నారు. కార్మికులకు నష్టదాయకంగా ఉన్న 12 14 మెమోను రద్దు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వెల్ఫేర్ బోర్డును పటిష్టం చేయాలన్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నాగభూషణం, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, గ్రానైట్ టైల్స్ కట్టర్స్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి రెడ్డి, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు నాగరాజురెడ్డి, బెండర్స్ యూనియన్ నాయకులు సూర్యనారాయణ, సిఐటియు నాయకులు కుమార్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, వరలక్ష్మి, లక్ష్మీనారాయణ, జీవరత్నం, శివ ప్రసాద్, నాగరాజు పీరా పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలను ఉపేక్షించం : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎవర్నీ ఉపేక్షించమని జిల్లా ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ స్పష్టం చేశారు. మంగళవారం నాడు పేకాట ఆడుతూ పట్టుబడిన అనంతపురం ఎఆర్ హెడ్ కానిస్టేబుల్‌ను ఎస్పీ సస్పెండ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్ పరిధిలో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు మంగళవారం సాయంత్రం పక్కా సమాచారం అందింది. ఎస్పీ ఆదేశాల మేరకు బుక్కరాయసముద్రం సిఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్పెషల్ టీం దాడులు నిర్వహించగా 17 మంది పేకాటజూదరులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.31,600 నగదు, 11 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో అనంతపురం ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ కూడా ఉన్నారు. శాఖాపరమైన చర్యల్లో భాగంగా సదరు హెడ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు శాఖలో పని చేసే సిబ్బంది పోలీసు వ్యవస్థకు చెడ్డపేరు వచ్చే విధంగా వ్యహరిసేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని తెలియజేశారు.

ఓపీఎస్ ఇచ్చే వారికే మద్దతు : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



ఓట్‌ఫర్ సిపిఎస్ బుక్‌లెట్స్‌ను విడుదల చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి పాత పెన్షన్ విధానం అమలు చేసే వారికే తమ మద్దతు ఉంటుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప తెలిపారు. అనంతపురంలోని యుటిఎఫ్ కార్యాలయంలో 'ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్లెట్'లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు కోరుతున్న ఓపీఎస్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండు చేశారు. ఎన్నికల ముందు ఓపిఎస్‌పై హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మాటమార్చడం దుర్మార్గం అన్నారు. ఓట్‌ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్ ద్వారా సీపీఎస్, జీపీఎస్ విధానంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు కలిగే నష్టాలను తెలియజేస్తూ పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు రమణయ్య, సహాధ్యక్షురాలు సరళ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, జిల్లా కార్యదర్శి ప్రమీల, సీనియర్ నాయకులు మహమ్మద్ జిలాన్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

టీడీపీ రాష్ట నాయకుడు జె. గౌస్ మొహిద్దీన్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం నగరంలో వేసవి కాలం రాకమునుపే తాగునీటి సమస్య తీవ్రతరం అవుతున్నా, సమస్యను పరిష్కరించడంలో కార్పొరేషన్ పాలకవర్గం పూర్తిగా విఫలం చెందిందని టిడిపి రాష్ట్ర నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు జె.గౌస్‌మొహిద్దీన్ విమర్శించారు. బుధవారం ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం అన్యాయంగా ఉందన్నారు. తాగునీటి సమస్య తీవ్రతరమైన నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే, మేయర్, ఇతర అధికారులు సమస్యను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు.

కొనకొండ్లలో నూతన సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండలంలోని మేజర్ పంచాయతీ కొనకొండ్ల గ్రామంలో రూ. 1.75కోట్ల వ్యయం తో ఏర్పాటు చేసిన నూతన సబ్‌స్టేషన్‌ను బుధవారం ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలైజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ సబ్ స్టేషన్ ద్వారా వజ్రకరూరు మండలంలోని పది గ్రామాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాతో పాటు వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించడానికి వీలవుతుందన్నారు. మరికొన్ని సబ్‌స్టేషన్లు నిర్మాణ దశలో ఉన్నాయని త్వరలోనే వాటిని ప్రారంభించి నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ సైట్ మేనేజర్ రవి, ఎలక్ట్రికల్ డిఇ రాజశేఖర్, డిప్యూటీ ఎడి మహేష్, ఎఇ షెక్షావలి, సర్పంచి ఇందిరమ్మ, ఎంపిటిసిలు పాపన్న, ముద్దయ్య, మునెయ్య, వైసిపి నాయకులు రమణారెడ్డి తిప్పారెడ్డి, శంకర్‌రెడ్డి, తిరుపాల్‌యాదవ్, మారుతి, సుంకన్న, రామచంద్ర, రామాంజనేయులు, గురు, కేశన్న, గురుస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

'ముల్లంగి' సోదరులు వైసిపిని వీడుతున్నారా..?

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలో అధికార పార్టీ వైసిపికి చెందిన 'ముల్లంగి' సోదరులు పార్టీని వీడే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. మండలంలోని ఉప్పరాల గ్రామ సర్పంచి, ఎంపిటిసి పదవుల్లో ఉన్న ముల్లంగి సోదరులతో పాటు వైసిపి నాయకులు త్వరలోనే టిడిపిలో చేరతారని జోరుగా ప్రచారం సాగుతోంది. వారిద్దరూ గత ఐదేళ్లుగా అధికార పార్టీలోనే అసమ్మతి నేతలుగా కొనసాగుతున్నారు. రాయదుర్గం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అనుచరులుగా ముద్రపడిన వారు పార్టీని వీడితే ఆ పార్టీకి పెద్ద షాక్ ఇచ్చినట్లే అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం కృషి చేసిన ముల్లంగి సోదరులు ఐదేళ్లుగా మౌనంగా ఉండి సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో పార్టీ వీడతారన్న ప్రచారం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.



ముల్లంగి సోదరులు

పాలవెల్లువ కేంద్రాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-నార్పల

మండల వ్యాప్తంగా ప్రారంభమైన పాలవెల్లువ కేంద్రాలపై గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ రాముడు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, వెటర్నరీ సిబ్బంది, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం మండల వ్యాప్తంగా 10 పాలవెల్లువ కేంద్రాలు ఏర్పాటు చేసిందని, ఆయా కేంద్రాలకు పాడి రైతులు పాలు తెచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఫిర్యాదులు లేకుండా సజావుగా నిర్వహించాలని, రోజు రోజుకు కేంద్రాలకు పాలు పోసే రైతుల సంఖ్యను పెంచాలని తెలిపారు. సమావేశంలో ఇఒఆర్‌డి శైలజారాణి పాల్గొన్నారు.

3కిలోల వెండి, నగదు స్వాధీనం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఆధారాలు లేకుండా 3 కిలోల వెండి, నగదు తీసుకెళ్తున్న వ్యక్తిని బుధవారం అదుపులోకి తీసుకొన్నట్లు రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. విడపనకల్లు చెక్‌పోస్ట్ వద్ద సిఐ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో కర్నాటక బస్సులో బళ్లారి నుంచి అనంతపురం నగరానికి బిల్లులు, ఆధారాలు లేకుండా 3 కిలోల వెండి ఆభరణాలు, రూ. 98,500 తీసుకెళ్తున్నట్లు గుర్తించామన్నారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన శంకర్‌ను అదుపులోకి తీసుకొని సీజ్ చేసిన వస్తువులను జిఎస్‌టి ఆఫీసర్లకు అప్పగించినట్లు తెలిపారు. సిఐతో పాటు విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్, సిబ్బంది ఉన్నారు.

దినసరి మార్కెట్, జంతువధశాలకు బహిరంగ వేలం

ప్రజాశక్తి-గుత్తి

గుత్తి మున్సిపాలిటీకు రూ.19.27 లక్షల ఆదాయం లభించింది. పురపాలక సంఘం పరిధిలో దినసరి మార్కెట్, జంతు వధశాలలో సుంకం వసూలు హక్కు కోసం బుదవారం సభా మందిరంలో మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో పది మంది ఔత్సాహికులు పాట పాడారు. దినసరి మార్కెట్ సుంకం వసూలును పట్టణానికి చెందిన మహమ్మద్ రఫీ రూ. 19 లక్షలకు, జంతు వధశాలలో వసూలును షాషావలి రూ. 27,500కు దక్కించుకున్నారు. గతంలో దినసరి మార్కెట్ ద్వారా రూ. 18.92 లక్షలు, జంతు వధశాల ద్వారా రూ. 27 వేలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటరెడ్డి, సచివాలయాల అధికారి ఇమామ్ హుస్సేన్, ఆర్ఐలు షేక్షావలి, సికె.రామాంజనేయులు, బిల్ కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



బహిరంగ వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేత

ప్రజాశక్తి-రాయదుర్గం

పేద, బడుగు, బలహీన వర్గాల కన్నీరు తుడిచే నేత సిఎం జగన్ అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప తెలిపారు. పట్టణంలోని సచివాలయం-1 పార్వతీనగర్, 1, 2వ వార్డు పరిధి లోని లబ్ధిదారులకు బుధవారం ఆమె కౌన్సిలర్ భీమనపల్లి నాగవేణితో కలిసి రిజిస్ట్రేషన్ హక్కు పత్రాలను అందజేశారు. అనంతరం పట్టణంలోని సచివాలయంలో నిర్వహించిన 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమంలో సచివాలయ పరిధిలోని వాలంటీర్లను శాలువాలతో సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. వాలంటీర్ల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జి దివాకర్, శివ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, రిజిస్ట్రేషన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలతో వాలంటీర్లు

నగరంలో ట్యాంకర్లతో నీటి సరఫరా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని బుడ్డప్పనగర్, మారుతినగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో బుధవారం ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేశారు. నీటి సమస్యపై మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన మేయర్ మహమ్మద్ వసీం ఆయా ప్రాంతాల్లో పర్యటించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను పర్యవేక్షించారు. మేయర్ మాట్లాడుతూ నీరు పంపింగ్ చేసే 2 మోటార్లు కాలిపోవడంతో నగరంలో నీటి సమస్య తలెత్తిందన్నారు. పూర్తి స్థాయిలో సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ ట్యాంకర్ల ద్వారా నిరంతరం నీటిని సరఫరా చేస్తామని మేయర్ స్పష్టం చేశారు.



నగరంలో ట్యాంకర్లతో నీరు సరఫరా చేస్తున్న అధికారులు

శాస్త్రీయ విజ్ఞానంతోనే మానవాభివృద్ధి : రాచపాలెం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మానవ అభివద్ధి అనేది శాస్త్రీయ విజ్ఞానంతోనే సాధ్యమవుతుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని నవోదయ కాలనీలోని గిరిజన గురుకుల పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.పార్వతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివి.రామన్ రామన్ ఎఫెక్ట్ కనుగొన్న రోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు చెప్పారు. శాస్త్రీయ విజ్ఞానం అభివద్ధి చెందినంత కాలం మానవ అభివద్ధి జరుగుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నగర గౌరవ అధ్యక్షురాలు డా॥పి.ప్రసూన, నగర అధ్యక్ష, కార్యదర్శులు రామిరెడ్డి, వీరరాజు, నాయకులు గాంగేనాయక్, విజయలక్ష్మి, రామకష్ణ, ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, తిప్పేస్వామి, ఆనంద్ పాల్గొన్నారు.



సర్ సివి రామన్‌కు నివాళి అర్పిస్తున్న జెవివి నాయకులు

రాష్ట్ర పునర్‌నిర్మాణ సభతో బూర్జువా పార్టీల్లో వణుకు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇటీవల అనంతపురంలో నిర్వహించిన రాష్ట్ర పునర్నిర్మాణ సభ విజయవంతం కావడంతో బూర్జువా పార్టీల్లో వణుకు పుట్టిందని సిపిఎం మండల కన్వీనర్ మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, ఉరవకొండ కాంగ్రెస్ పార్టీ నాయకులు బ్యాళ్ల ప్రసాద్ పేర్కొన్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ప్రకటించిన మేనిఫెస్టోలో ప్రతి కుటుంబానికి నెలకు రూ. 5వేల పథకంతో ఎంతోమందికి మేలు జరుగుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం కాంగ్రెస్ పార్టీదేనని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు, జగన్, పవన్‌కల్యాణ్ ఎన్ని కుట్రలు చేసి అడ్డొచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఆపలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు డిసిసి ఉపాధ్యక్షులు వడ్ల ఆంజనేయులు, కార్యదర్శి సోనియా శీన, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, పట్టణ అధ్యక్షులు సుధాకర్, హిదాయత్ ఖాన్, బిసి సెల్ నాయకులు ఇంద్రావతి ఓబులేసు, సూఫీ కరీం, టైలర్ రమేష్, వజ్రకరూరు మండల కన్వీనర్ శ్రీకాంత్‌వర్మ, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి రేగాటి శివకృష్ణ, ఎఐఎస్ఎఫ్ నేత హారున్ రషీద్ పాల్గొన్నారు.



ఉరవకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎస్వీ కళాశాలలో మెగా జాబ్‌మేళా

1000 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని జీసస్ నగర్‌లో ఉన్న ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో వెయ్యి మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ఛైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. కళాశాల వైస్ ఛైర్మన్ సిచక్రధరరెడ్డి, హరీష్‌కుమార్ యాదవ్ ఫౌండేషన్ ఛైర్మన్ హరీష్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 70కి పైగా కంపెనీలు పాల్గొన్నాయి. అందులో ఐటి, బిపిఒ, ఫార్మా, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, మ్యానుఫాక్చరింగ్, మీడియా రంగాలకు చెందిన కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీ యువకులు 3,500 మంది హాజరు కాగా వెయ్యి మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అందులో 350 మందికి తక్షణ ఎంపిక పత్రాలు జారీ చేయగా మిగిలిన 650 మందికి షార్ట్ లిస్ట్ చేశారు. వారికి కూడా మరో రెండు రోజుల్లో ఎంపిక పత్రాలు జారీ చేస్తామని కంపెనీల నిర్వాహకులు తెలిపారు. అలాగే కళాశాల యాజమాన్యం, అపిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాంపస్‌లో టెక్ మహీంద్ర కంపెనీ క్యాంపస్ డ్రైవ్ కూడా నిర్వహించారు. ఇందులో నిరుద్యోగ యువత పాల్గొని 78 మంది ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన వారిని కళాశాల ఛైర్మన్ డాక్టర్ సి.సోమశేఖర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి, ప్రిన్సిపల్ వై.మధుసూదనరెడ్డి, హరీష్ కుమార్ యాదవ్, అపిత ఫౌండేషన్ డైరెక్టర్ రాజగోపాల్ అభినందించారు.



ఉద్యోగ నియామక పత్రాలతో ఎంపికైన అభ్యర్థులు

ఎస్సీ వర్గీకరణ అనుకూల పార్టీలకే మద్దతు

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ

ప్రజాశక్తి-గుత్తి

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా ఉన్న రాజకీయ పార్టీలకే మాదిగల మద్దతు ఉంటుందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ స్పష్టం చేశారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం ఎంఆర్‌పిఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కె.సునీత ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల ఎంఆర్‌పిఎస్, ఎంఎస్ పి అనుబంధ సంఘాల జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మందకృష్ణ మాట్లాడుతూ ఎ, బి, సి, డి వర్గీకరణ కోసం 30 ఏళ్లగా పోరాటం చేస్తున్నామన్నారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టులో విచారణ జరిగిందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలతో ప్రత్యేక కమిటీ ఏర్పడిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు వైసిపి మినహా అన్ని పార్టీలు అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జాతీయ నాయకుడు గుండాల ఈశ్వర య్య, జిల్లా అధ్యక్షుడు హరి గోపాల్, ఎంఇఎఫ్ నాయకుడు గంగాధర్, ఎంఎస్‌పి నాయకుడు కదిరప్ప, నాయకులు నరసింహులు, బండారు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మందకృష్ణ

చీని చెట్ల పెంపకంతో అధిక రాబడి

ప్రజాశక్తి-గుత్తి

చీని చెట్ల పెంపకం ద్వారా రైతులకు అధిక రాబడి వస్తుందని అనంతపురం హెచ్‌ఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండలంలోని మాముడూరు గ్రామంలో ఓ రైతు సాగు చేసిన చీని తోటలో బుధవారం శాస్త్రవేత్తలు, ఉద్యానవన శాఖ అధికారులు మైక్రో న్యూట్రిన్స్, పశువుల ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తిరుపతి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ముకుందలక్ష్మి, డాక్టర్ బి.దత్తారెడ్డి, ఉద్యానవన అధికారిణి మిత్రవింద మాధవి, వైసిపి నాయకులు జి.గోవర్ధన్‌రెడ్డి, మెట్టు లక్ష్మికాంతరెడ్డి, ఆర్‌బికె సిబ్బంది మహేష్, రమణ, బాలరాజు, మౌనిక, అజయ్, విహెచ్ఎలు పాల్గొన్నారు.



చీని తోటలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెండు రోజూ సజావుగా 'టెట్'

అనంతపురం సిటీ : జిల్లా వ్యాప్తంగా రెండో రోజూ టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) సజావుగా జరిగింది. అనంతపురం నగరంలో 6, తాడిపత్రిలో 2, గుత్తిలో ఒక కేంద్రంలో టెట్ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 1,366 మందికి గానూ 1,265 మంది, మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకూ జరిగిన పరీక్షకు 1,365 మందికి గానూ 1,231 మంది హాజరయ్యారు.

క్రికెట్ నెట్స్ ఏర్పాటు

బెళుగుప్ప : పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో క్రికెట్ నెట్స్, సిమెంట్ పిచ్ ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి ఇద్దరు వ్యక్తులు నెట్స్ ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థులు రూ. 38 వేలతో క్రికెట్ నెట్స్, రూ. 20వేలతో సిమెంట్ పిచ్, ఐరన్ పైపులు, లేబర్ ఖర్చుల కోసం రూ. 30 వేలు అందజేశారు. హెచ్ఎం వెంకటప్రసాద్, ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పిడి రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు మాదిగల ఆత్మీయ మహాసభ

ఉరవకొండ : స్థానిక గాంధీ హరిజన హాస్టల్ స్థలాన్ని ఆన్‌లైన్ చేయడంలో నిర్లక్ష్యం, సార్వత్రిక ఎన్నికల్లో దళితుల పాత్ర, వారి అభివృద్ధి, తదితర అంశాలపై గురువారం పట్టణంలో నిర్వహిస్తున్న 'మాదిగల ఆత్మీయ మహాసభ'ను జయప్రదం చేద్దామని దళిత సంఘాల నాయకులు, గాంధీ హరిజన హాస్టల్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

29వ డివిజన్‌లో 'ఇంటింటికీ వైసిపి'

అనంతపురం : నగరంలోని 29వ డివిజన్‌లో బుధవారం 'ఇంటింటికీ వైసిపి' నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. మరోసారి వైసిపిని, వైఎస్ జగన్‌ను ఆదరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



'ఇంటింటికీ వైసిపి'లో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ : పట్టణంలోని లక్ష్మీనరసింహ కాలనీలో బాలాంజనేయస్వామి ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి బుధవారం సర్పంచి లలిత భూమిపూజ చేశారు. ఆమె మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలను పాటించి పనులను గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్ర మంలో ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేష్, నాయకులు బసవరాజు, చంద్రమ్మ, రామిరెడ్డి, అంగ దాల అంజి, జోగి భీమన్న, ప్రకాష్, స్కూల్ కమిటీ ఛైర్మన్ శర్మాస్, బేల్దారి శర్మాస్, శ్రీనివాస్, రంగప్ప, రామకృష్ణ పాల్గొన్నారు.

2న మెగా వైద్యశిబిరం

నార్పల : స్థానిక తిక్కయ్యస్వామి గుడి ఆవరణలో మార్చి 2వ తేదీ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కర్నూలు నగరంలోని ఎఎ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కోనంకి అజిత్‌కుమార్‌చౌదరి ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిపుణులైన వైద్యులు అన్ని రకాల జబ్బులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. మధ్యాహ్నం భోజన సదుపాయం కలదు.

ఘనంగా షంషీర్ వేడుకలు

రాయదుర్గం : పట్టణంలోని కొండపై వెలిసిన హజరత్ సయ్యద్ జాఫర్ షావలి దర్గా షంషీర్ కార్యక్రమం బుధవారం పట్టణంలో గుర్రం మీద ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక ఆత్మకూరు వీధి నుంచి ఊరువాకిలి, వినాయక సర్కిల్ మీదుగా శాంతినగర్‌లోని హజరత్ సయ్యద్ బర్కత్ షావలి దర్గా వరకూ వెళ్లి అక్కడి నుంచి తిరిగి కొండపై ఉన్న దర్గా వరకూ ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బళ్లారి నుంచి వలిబాషా సాహెబ్ పాల్గొన్నారు. మంగళవారం రాత్రి జరిగిన ఖవ్వాలి కార్యక్రమానికి ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఎస్.ఇబ్రహీం, అహ్మద్‌ఖాన్ టిప్పుసుల్తాన్, అల్లాబకాష్, గపూర్, ముర్షద్ పీరా, సలీంబాషా పాల్గొన్నారు.

టిసి హైస్కూల్‌లో క్విజ్ పోటీలు

పామిడి : స్థానిక టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయులు రామాంజనేయులు మాట్లాడుతూ 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్‌లో క్విజ్ పోటీలు నిర్వహించామన్నారు. 'శాస్త్రవేత్తలు-అభివృద్ధిలో వారి పాత్ర' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించామన్నారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాంకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

రాయదుర్గం : పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన రాజేష్(32) మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడికి రెండేళ్ల కుమార్తె ఉంది. భార్య ప్రస్తుతం గర్భిణి. ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణం అని తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక రీచ్‌లో పడి వృద్ధుడు మృతి

పెద్దపప్పూరు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక డంప్‌లో నిలిచిన నీటిలో పడి బుధవారం చాకలి ఓబులేసు(65) మృతిచెందాడు. మాఘమాసం సందర్భంగా పెద్దపప్పూరులో జరిగే బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల కోసం పెన్నానదికి నీరు వదిలారు. దీంతో ఇసుక్ డంప్‌లో నిలిచిన నీటిలో దుస్తులు ఉతుక్కునేందుకు వెళ్లిన ఓబులేసు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందినట్లు బంధువులు, స్థానికులు తెలిపారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.

కర్నాటక మద్యం స్వాధీనం

డి.హీరేహాల్ : మండలంలోని వసుగుడ్డం గ్రామానికి చెందిన హనుమేష్ కర్నాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో బుధవారం ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. హనుమేష్ ఇంట్లో కర్నాటక మద్యం (40 టెట్రా ప్యాకెట్లు) స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట జూదరులు అరెస్ట్

పెద్దపప్పూరు : మండలంలోని చాగల్లు రిజర్వాయర్ సమీపంలో పేకాట ఆడుతున్న వారిని బుధవారం ఎస్ఐ శరత్‌చంద్ర అరెస్ట్ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ. 24,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు, జాగ్రత్తలపై ర్యాలీ

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని ఆకుతోటపల్లి గ్రామంలో బుధవారం రోడ్డు ప్రమాదాలు-జాగ్రత్తలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో రాధ స్కూల్, సేతు స్కూల్, ఎంపిపి స్కూల్ విద్యార్థులు ఆకుతోతపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎస్‌కెయు కాప్స్ ఎన్ఎస్ఎస్ విభాగం-1 వాలంటీర్లు మూకాభినయ ప్రదర్శన చేశారు. ఎస్కేయూ ఫార్మా సుటికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ జి.సోమశేఖర్, ప్రోగ్రాం ఆఫీసర్ పి.సత్యసౌమ్య, 70మంది వాలంటీర్లు పాల్గొన్నారు. వారు ట్రాఫిక్ నియమాలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలపై వివరించారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన రాజేంద్రప్రసాద్‌కు అంకితం చేస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు.

రాయదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా పి.కిషోర్

రాయదుర్గం : మున్సిపల్ నూతన కమిషనర్‌గా పి.కిషోర్‌ను నియమించారు. ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా నందికొట్కూరు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న కిషోర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న షేక్ అబ్దుల్ మాలిక్‌ను మున్సిపల్ వ్యవహారాల శాఖ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు.



ఘనంగా సైన్స్ దినోత్సవం

పాఠశాలల్లో సర్ సివి రామన్‌కు నివాళి



సైన్స్ ప్రాజెక్టులతో నవభారత్ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం నగరంలోని ఎటిపి-8, 9 బ్రాంచిలు, కోర్టు రోడ్డు, కమ్మ భవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఎజిఎం సుబ్బారెడ్డి సైన్స్ దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో భారత్ ఎంతో పురోగతి సాధించిందన్నారు. భారతీయ భౌతిక శాస్త్రవేత్త సర్.చంద్రశేఖర్ వెంకట రామన్ 1928లో రామన్ ఎఫెక్ట్‌ను ఆవిష్కరించారు. ఆ రోజునే సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించి, ఆకట్టుకున్న వాటికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, కోఆర్డినేటర్ శ్రీనివాస రావు, ఎఒ గోపాల్, డీన్‌లు సిరాజుద్దీన్, అప్పలనాయుడు, మహేష్, సైన్స్ అధ్యాపక బృందం, ప్రైమరీ ఇన్‌ఛార్జులు నీరజ, భారతి, రామ్‌నగర్ బ్రాంచిలో ప్రిన్సిపల్ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రాధాకృష్ణనాయుడు, డీన్‌లు శ్రీనివాస్, రిషిబాల, సతీష్, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోక్షిత్ స్కూల్‌లో..

నగరంలోని విన్సెంట్ ఫెర్రర్‌నగర్‌లో ఉన్న మోక్షిత్ స్కూల్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కరెస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి ప్రతి ప్రాజెక్ట్‌ను వీక్షించి ప్రాజెక్ట్ ఉద్దేశం, ఉపయోగం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వై.లక్ష్మి సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాయి విజ్ఞాన్ పాఠశాలలో..

నగరంలోని 3వ రోడ్డులో ఉన్న 'సాయి విజ్ఞాన్ పాఠశాల'లో డైరెక్టర్లు ఎంపి.శ్రీనివాసులు, సి.కరుణాకర్ బాబు, ప్రిన్సిపల్ లావణ్యరామ్ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించి సందర్శనకు వచ్చిన వారికి చక్కగా వివరించారు. ఉత్తమ ప్రాజెక్టులకు సర్టిఫికెట్లు అందజేశారు.

శ్రీసాయి విద్యానికేతన్‌లో..

నగరంలోని శ్రీసాయి విద్యానికేతన్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రాజెక్టులను ఎంఇఒ సరిత సందర్శించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులను తిలకించి వాటిపై ప్రశ్నలు సంబంధించి సమాధానాలు రాబట్టి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కుసుమ పుల్లారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవభారత్‌లో..

నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డు ఆజాద్‌నగర్‌లో ఉన్న నవభారత్ పాఠశాలలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రాజెక్టులను కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నిట్టూరు కృష్ణవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .

మాంటిస్సోరి విద్యాసంస్థల్లో..

నగరంలోని సంగమేశ్‌నగర్, గుత్తి రోడ్డులో ఉన్న మాంటిస్సోరీ పాఠశాలల్లో విజ్ఞాన్ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. విద్యార్థులు వివిధ అంశాలపై రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను కరస్పాండెంట్ సి.సుర్యనారాయణరెడ్డి తిలకించి ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి మాధవి, ప్రిన్సిపల్స్ రమాదేవి, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చియ్యేడు జడ్పీ హైస్కూల్‌లో..

రూరల్ మండలంలోని చియ్యేడు గ్రామం జడ్పీ హైస్కూల్‌లో ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో ముఖ్యఅతిథిగా ఎపి సాహిత్య అకాడమీ గ్రహీత డాక్టర్ పతికి రమేష్, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకులు సుంకర రమేష్, హెచ్ఎం వెంకటరమణ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 'విద్యార్థి దశ నుంచే సైన్స్ విజ్ఞానంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలను వారు తిలకించి సంతృప్తి వ్యక్తం చేశారు. డ్రాయింగ్, వ్యాసరచన పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి సాకే రాజా, కె.మహేంద్ర, ఎస్.మంజుల, జెఎన్‌టియు ఎన్ఎస్ఎస్ విద్యార్థి జి.నందిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతీ విద్యానికేతన్‌లో ..

అనంతపురం క్రైం : నగర సమీపంలోని పాపంపేట శ్రీ సరస్వతి విద్యా నికేతన్ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల కరస్పాండెంట్ రామచంద్ర సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన వివిధ నమూనాలను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీరామచంద్ర, జబీనా, ఏవో బాషా, రోజా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నార్పల : సైన్స్ నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తాడిపత్రి : పట్టణంలోని విజయనగర కాలనీలో ఉన్న పద్మవాణి హై స్కూల్‌లో సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ నాగరాజు హాజరై సివి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులు వంద సైన్స్ నమూనాలు తయారు చేసి చక్కని విశ్లేషణ చేసి అందరినీ అబ్బురపరిచారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నాగపీరయ్య, హెచ్ఎం అలీమ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పట్టణంలోని సెయింట్ పాల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో హెచ్ఎం బి.సుగుణజ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులు సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. నమూనాలు చూపరుల ను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఎం.రాజేశ్, ఎం.మయూర, సురేశ్, రూపారాణి పాల్గొన్నారు.

నార్పల : స్థానిక మిత్ర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన నమూనాలను ప్రదర్శనగా ఉంచి వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర పాఠశాలల విద్యార్థులు సందర్శించి నమూనాల గురించి తెలుసుకున్నారు. సైన్స్ డే సందర్భంగా సివి రామన్ చిత్రపటానికి కరస్పాండెంట్ మీనాక్షినాయుడు, ప్రిన్సిపల్ శశికళ, సిబ్బంది, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పుట్లూరు : స్థానిక జడ్పీ హైస్కూల్, ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను ప్రదర్శనగా ఉంచి వైజ్ఞానిక సదస్సు నిర్వహించారు. పలువురు విద్యార్థులు సందర్శించి వాటి ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అనంతపురం : కోర్టు రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎజిఎం సుబ్బారెడ్డి

రాయదుర్గం : పట్టణంలోని సరస్వతీ శిశు మందిరంలో పాఠశాల కమిటీ అధ్యక్షులు పొరాలు ధనార్జున, హెచ్ఎం రాజేశ్వరి ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సం నిర్వహించారు. విద్యార్థులు వివిధ సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించగా ఉత్తమ ప్రాజెక్టులకు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జయంతి సురేష్, కౌన్సిలర్ ప్రశాంతి, బండి భారతి హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రకళ, మహాదేవి, భవాని, పాఠశాల కార్యదర్శి కోశాధికారి సాంబమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

బెళుగుప్ప : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. మెయిన్ స్కూల్ విద్యార్థులు సైన్స్ నమూనాలను తిలకించి వాటి గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ రఫీ, ఉమాశంకర్, రామ్మూర్తి, పాల్గొన్నారు.

ఉరవకొండ : పట్టణంలోని ఎవిఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించి వివిధ నమూనాలు, వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించారు. ప్రిన్సిపల్ విక్రంబాబు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసు నుంచే సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉంటూ నైపుణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని చిత్రచేడు జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు రకాల సైన్సు ప్రయోగాలను ఆవిష్కరించారు. హెచ్ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వైజ్ఞానిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థి ఆనంద్‌కు ప్రోత్సాహక బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశులు, శ్రీనివాసరెడ్డి. పలువురు పాల్గొన్నారు.



ఉరవకొండ ఎవిఆర్ పాఠశాలలో..



తాడిపత్రి : పద్మవాణి స్కూల్‌లో పరిశీలిస్తున్న ఎంఇఒ నాగరాజు



రాయదుర్గం : స్కూల్‌లో చిన్నారుల సైన్స్ నమూనాలు..



చియ్యేడు జడ్పీ హైస్కూల్‌లో..

ఘనంగా టైలర్స్ దినోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

అంతర్జాతీయ టైలర్స్ డే సందర్భంగా బుధవారం నగరంలోని టిడిపి అర్బన్ కార్యాలయంలో టైలర్లు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి తనయుడు మధుకర్‌చౌదరి, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు హాజరై మాట్లా డారు. టైలర్లు స్వశక్తితో వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, అలాంటి వారికి ప్రభుత్వాలు చేయూత అందించాలన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే టైలర్ వృత్తిపై జీవిస్తున్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో చంద్రన్న టైలర్ యూనియన్ అధ్యక్షుడు ముత్యాలు, పూల బాషా, సాయికుమార్, నిట్టూరు శివాజీ, సిరివాటి వన్నూరు, శీన, ఉమాదేవి, వాణి, రాధిక, పార్వతి, నాగరాజు, బాబావలి, నౌషాద్, కమ్మగిరి, స్వామి, సలీం, బుట్టా మురళి పాల్గొన్నారు.



టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మధుకర్‌చౌదరి, లక్ష్మీనరసింహులు

రాయదుర్గం : మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప పట్టణంలోని 2వ వార్డులో టైలర్లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వారి సమస్యలు తెలుసుకుని, అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. ఆమెతో పాటు వైసిపి నాయకులు పొరాలు శివ, గిరిజాపతి ఉన్నారు.

టైలర్ల సమస్యలు పరిష్కరించాలి

రాయదుర్గం : పట్టణంలోని గార్మెంట్స్ పరిశ్రమంలో పని చేస్తున్న టైలర్ల సమస్యలు పరిష్కరించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి బిఎం నాదల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రపంచ టైలర్ల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వేలాది మంది కార్మికులు(టైలర్లు) కుట్టు పని చేస్తూ జీవనం సాగిస్తున్నార న్నారు. వారు అనేక సమస్యలు ఎదుర్కొంటు న్నారన్నారు. కార్మికులకు విద్యుత్ రాయితీలు, సబ్సిడీలు, జీవిత బీమా, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు.

'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెన్నరాయుడు పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టంలో నిబంధనలు, కూలి గిట్టకపోవడం, సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం, తదితర కారణాలతో కూలీలు పనులు చేయడానికి వెళ్లడం లేదన్నారు. ఇటీవల కూలీలు వలస వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రకరూరు మండలానికి చెందిన 12 మంది తీవ్రంగా గాయపడ్డారని, వారికి రూ. 5 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగు తున్న ధరలకు అనుగుణంగా కూలీ పెంచాలని, పనిముట్లు, పని చేసే చోట కూలీలకు సౌకర్యాలు, ఏడాదికి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఉపాధి హామీ మేట్‌లు వెంకటేశ్వర్లు, రామాంజనేయులు, కె.బండయ్య, ఎర్రిస్వామి, సుధాకర్, కూలీలు ఉన్నారు.

భారతీయ అంబేద్కర్ మిషన్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-పామిడి

భారతీయ అంబేద్కర్ మిషన్ జాతీయ కార్యదర్శిగా దేవరపల్లి గోపాల్, రాష్ట్ర అధ్యక్షుడిగా బుటారి అరుణ్‌కుమార్ నియమితులయ్యారు. వారు మాట్లాడుతూ సంస్థ ఆశయ సాధన, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. జాతీయ అధ్యక్షులు దర్శన్‌సింగ్ కాంగ్రా తమపై ఉంచిన బాధ్యతల ను సక్రమంగా నిర్వర్తిస్తామన్నారు.